సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 9 । జూన్ । 2024



పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి

జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ ఆరిఫ్‌హాఫిజ్ చెప్పారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,567
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,764
సవర (8 గ్రాములు)	రూ.54,112

గరిష్టం/కనిష్టం
36.1 /24.2

వాతావరణం

వాతావరణంలో తేమ 63 శాతం ఉంది. జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

అమాత్య 'రేస్'లో ఆశావహులు

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఇప్పుడు ఆ పార్టీలో మంత్రి పదవుల పోటీ తీవ్రంగా నెలకొంది. రాజకీయ చైతన్యంతో పాటు రెడ్డి సామాజిక ఆధిపత్యం ఉన్న జిల్లా నెల్లూరు. అనేకానేక సమీకరణల నేపథ్యంలో మంత్రి పదవి ఎవరిని వరిస్తోందో అనే చర్చ హాట్‌టాపిక్‌గా ఉంది. జిల్లాకు చెందిన ముగ్గురు మాజీ మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యే ఒకరు, మహిళా కోటాలో ఏకైక ఎమ్మెల్యే మరొకరు పోటీ పడుతున్నారు.

- నారాయణకు బెర్త్ కన్ఫర్మేనా?
- పోటీ పడుతున్న సోమిరెడ్డి, ఆనం, కోటంరెడ్డి
- మహిళా కోటాలో ప్రశాంతిరెడ్డి ఒత్తిడి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో మంత్రి పదవి కోసం పోటీ పడే ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. నెల్లూరు సిటీ నుంచి ఎన్నికైన పొంగూరు నారాయణకు ఇప్పటికే మంత్రి బెర్త్ కన్ఫర్మ్ అయిందని జిల్లా రాజకీయ వర్గాల్లో విస్తతంగా జరుగుతోంది. అయితే జిల్లాలో సీనియర్లు అయిన ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పోటీలో ఉన్నారు. మహిళా కోటాలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీలో కొనసాగుతున్నారు.

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి వెంకటగిరి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించిన ఆనం రామనారాయణరెడ్డి జిల్లాలోనే సీనియర్ పొలిటీషియన్. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కలేదని తీవ్ర ఆగ్రహంతో ఆయన ఆ పార్టీకి దూరమయ్యారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విప్ ధిక్కరించి ఓటు వేసి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. టీడీపీలో చేరిన ఆనం తాజాగా ఆత్మకూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పుడు ఆయన మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. మరి ఆనంకు మంత్రి పదవి దక్కుతుందా? మొండి చేయి చూపిస్తే.. ఆయన ప్రతిస్పందన ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరుగుతోంది.

సోమిరెడ్డి ట్రయల్స్..

జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సైతం మంత్రి పదవి కోసం పైరవీ చేస్తున్నట్లు సమాచారం. గతంలో వరుసగా ఐదు సార్లు ఓటమి పాలైన సోమిరెడ్డికి ఈ దఫా టికెట్ దక్కడంపై చివరాఖరు వరకు సందిగ్ధం నెలకొంది. ఎట్టకేలకు టికెట్ దక్కించుకున్న సోమిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

కోటంరెడ్డి కోరిక నెరవేరుతుందా?

నెల్లూరు రూరల్ నుంచి గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నాడు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కోటంరెడ్డి మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేశాడు. ఆ పదవి దక్కలేదని కన్నీరు సైతం పెట్టుకున్నాడు. ఇదే నా చివరి రాజకీయ జీవితమంటూ మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీపై ధిక్కార స్వరం వినిపించారు. అదే సమయంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విధించిన విప్‌ను ధిక్కరించి టీడీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయడంతో ఆయన్ను పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా స్పీకర్ ప్రకటించారు. గత ఎన్నికలే చివరివి అని చెప్పిన కోటంరెడ్డి ఈ దఫా టీడీపీ నుంచి మరో సారి బరిలో నిలిచి గెలిచారు.


మహిళా కోటాలో ప్రశాంతిరెడ్డి డిమాండ్

ఇకపోతే మంత్రి పదవి రేస్‌లో కోవూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సైతం ముందు వరుసలో ఉన్నారు. జిల్లాలో ఏకైక మహిళ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కావడంతో మహిళా కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల్లో పార్టీకి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచామని, తనకే మంత్రి పదవి కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చారని, ఆ విధంగానే ఒకటి మాత్రం తమకు కేటాయించాలని టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి పెంచుతున్నట్లు వేమిరెడ్డి వర్గాల ద్వారా సమాచారం. ఎన్‌డీఏ కూటమిలో టీడీపీ భాగస్వామ్యం కావడంతో ప్రశాంతిరెడ్డి భర్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మంత్రి కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. అయితే రాష్ట్రానికి నాలుగు కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశం ఉండడం, టీడీపీ, బీజేపీ, జనసేన నుంచి కేంద్ర మంత్రి పదవి ఆశావహులు ఉండడంతో వేమిరెడ్డి అవకాశం దక్కుతుందా? అనేది సందిగ్ధం నెలకొంది. ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి దక్కకపోతే.. ప్రశాంతిరెడ్డికి రాష్ట్ర మంత్రి పదవితో వేమిరెడ్డి దంపతులను సంతృప్తి పరిచే అవకాశం లేకపోలేదనే రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి దక్కితే.. ప్రశాంతిరెడ్డి టీటీడీలో గతంలో తాను ఉన్న పదవినైనా ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం.



నారాయణ, ప్రశాంతిరెడ్డి, ఆనం, సోమిరెడ్డి, కోటంరెడ్డి

పిడుగులతో పెనుముప్పు



- వర్షాకాలంలో పొంచి ఉన్న విపత్తులు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

నెల్లూరు (బారకాసు): ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పిడుగులు పడే అవకాశాలు ఎక్కువే. ఈ పిడుగు ఎక్కడ పడుతుందో, ఎలా పడుతుందో తెలియని పరిస్థితి. పిడుగు పడిన సందర్భంలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంటుంది. మెరుపుల ధాటికి గృహోపకరణాలు కూడా కాలిపోతుంటాయి. పిడుగు ప్రభావంతో నష్టం భారీగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తోంది. సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆ శాఖాధికారులు చెబుతున్నారు.

పిడుగు తీవ్రత ఎలా ఉంటుందంటే..

వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై మెరుపు వేగంతో కాంతి రూపంలో విద్యుత్ నేలకు చేరుకుంటుంది. ఒక్క సారిగా విద్యుదావేశం పెరిగి మేఘాల సమీపంలో వ్యతిరేక విద్యుదావేశం ఉన్నప్పుడు వాతావరణంలోని తేమ, దుమ్ము కారణంగా వాటిలోని స్థిర విద్యుత్ భూమి వైపు ప్రవహిస్తోంది. ఒక మిల్లీ సెకన్ కాలంలో మెరుపుతో కూడిన పిడుగు 20 వేల అంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2 లక్షల ఓల్టులతో సమానం. ఇది భూమి నుంచి ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర పొడవు ఉంటుంది. రెండు మేఘాల మధ్య అయితే ఏడు కిలో మీటర్ల నుంచి 140 కిలో మీటర్ల దూరంలో ఉంటాయి. పిడుగులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్ట తీవ్రత ఉంటుంది.

కాపర్ ఎర్త్ ఏర్పాటుతో ప్రమాదానికి చెక్

పిడుగు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్‌ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు కిలో మీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్రి బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమి లోపలికి ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది. ఎత్తైన టవర్లు ఏర్పాటు చేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించడంతో పిడుగు పాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తైన చెట్టు కింద ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.
- లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, కెమెరాలు, సెల్ ఫోన్‌లు దగ్గర లేకుండా చూసుకోవాలి. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

సముద్ర జీవుల రక్షణకు కృషి



కృష్ణపట్నం తీరంలో చెత్త ఏరివేస్తున్న దృశ్యం

- పోర్టు సీఓఓ రాజన్‌బాబు

ముత్తుకూరు: సముద్ర జీవుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదాని కృష్ణపట్నంపోర్టు సీఓఓ రాజ న్‌బాబు అన్నారు. ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం సందర్భంగా శనివారం పోర్టు మెరైన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తీరం పరిశుభ్రంగా ఉంటే సముద్ర జీవరాసుల మనుగడ క్షేమంగా ఉంటుందన్నారు. 2008 జూన్ 8న ఐక్య రాజ్య సమితి ప్రపంచ మహాసముద్రాల దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ రజిత్‌కార్గ్, కెప్టెన్ సాహు, గణేష్‌శర్మ, వెంకటేష్ భాస్కరన్ పాల్గొన్నారు.

డీసీఎమ్మెస్ చైర్మన్ పదవికి చలపతిరావు రాజీనామా



వీరి చలపతిరావు

కొడవలూరు: డీసీఎమ్మె స్ (జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ పదవికి వీరి చలపతిరావు శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఆ పదవికి రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. తన రాజీనామాను ది రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్, ఆంధ్రప్రదేశ్‌కు పంపారు. నాలుగేళ్లుగా ఆయన డీసీఎమ్మెస్ చైర్మన్‌గా కొనసాగారు. ఆ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి సంస్థ అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతగానో కృషి చేశారు.

ఏపీడీడీసీఎఫ్ రాష్ట్ర చైర్మన్ పదవికి 'చిల్లకూరు' రాజీనామా



చిల్లకూరు సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి తన పదవికి శనివారం రాజీనా మా చేశారు. తోటపల్లిగూడూరు మండలం పోట్లపూడి గ్రామానికి చెందిన చిల్లకూరు సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో సీనియర్ నేతగా ఉన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడంతో ఆయన సహకారంతో ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలెప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ పదవి పొందారు. రాష్ట్రంలో వైఎ స్సార్‌సీపీ ప్రభుత్వం పరాజయానికి తోడు సర్వేపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓటమి చవి చూడడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చిల్లకూరు సుధీర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 331 లభించింది. జనరల్ క్లస్టర్ రైతులు 901 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 714 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 187 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ. 205 ధర లభించగా, సగటున కిలో పొగాకుకు రూ. 293 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సోమశిలకు స్వల్పంగా వరద

- 521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆదినిమ్మాయపల్లి వద్ద 4 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

నెల్లూరు (దర్గామిట్ట): రాయలసీమ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల సోమశిల జలాశయానికి వరద ప్రవాహం రానుంది. జలాశయం ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల 521 క్యూసెక్కుల వంతున వరద కొనసాగుతోంది. రాయలసీమ ప్రాంతాలైన నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పెన్నానది ప్రధాన హెడ్‌రెగ్యులేటర్ అయిన ఆదినిమ్మాయపల్లి వద్ద 4 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. పెన్నానదిలో నీటి నిల్వలు పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రవాహం జలాశయానికి చేరే సరికి ఆదివారం సాయంత్రం కావచ్చునని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ప్రస్తుతం జలాశయంలో 7.293 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నాటక ప్రదర్శనల్లో ఘనాపాటి

- శభాష్ అనిపించుకుంటున్న చినమీరా
- అంగధుడు, ఆంజనేయుడి పాత్రలతో మన్ననలు



వెంకయ్యనాయుడు, వెంకటేష్‌తో చినమీరా (ఫైల్)

తోటపల్లిగూడూరు: సినిమాలు.. యూట్యూబ్.. ఓటీటీల యుగంలో నాటకాలకు ఆదరణ అంతంతమాత్రంగా ఉంటోంది. అయినా తన అద్భుత నటనతో తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన షేక్ చినమీరా శభాష్ అనిపించుకుంటూ నాటక రంగానికే జీవం పోస్తున్నారు. చిన్నతనం నుంచే నాటక రంగంపై ఈయనకు అమితాసక్తి. వ్యవసాయ కుటుంబంలో చినమీరా జన్మించారు. చిన్నతనంలో ఆలపించిన పద్యాలే ఆయనకు ఈ రోజు రాష్ట్ర స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయి.

వివిధ పాత్రల్లో అలరిస్తూ..

40 ఏళ్ల సుదీర్ఘ నాటక రంగ ప్రస్థానంలో ఆంజనేయుడు, అంగధుడు, అర్జునుడు ఇలా పలు పాత్రల్లో చినమీరా అలరించారు. నాటక రంగ కళను దేవుడిచ్చిన వరంగా భావిస్తూ.. సాధనతో తన స్వరాన్ని మాధుర్యంగా మలచి ప్రేక్షకులకు మంత్రముగ్ధులను చేస్తున్నారు. నాటక రంగంలో అడుగిడిన తొలినాళ్లలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని నిలిచారు.

మూడు వేల నాటకాల్లో ప్రదర్శన

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు మూడు వేలకుపైగా నాటకాలను ప్రదర్శించారు. కేవలం కళ కోసమే నాటక రంగంలో సుదీర్ఘ ప్రయాణం సాగిస్తూ వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి గడించిన ప్రముఖ రంగస్థల నటులు షణ్ముక ఆంజనేయరాజు, లక్ష్మణరావు, రావూరు సుబ్బారావుతో కలిసి ఎన్నో నాటకాలను ప్రదర్శించారు.

ప్రముఖుల అభినందన

ఆంజనేయ పాత్రలో అద్భుత నటనను ప్రదర్శించిన చినమీరాను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీ నటుడు వెంకటేష్ ప్రశంసించారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఐదేళ్ల క్రితం నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆంజనేయపాత్రతో చేసిన ఏకపాత్రాభినయం సభికులను ఆకట్టుకుంది. చినమీరా నటనను మెచ్చిన వారు ప్రశంసపత్రం, జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాన్ని అందించారు. ఇలా ఎన్నో అవార్డులను అందుకుంటూ కళాకారులకు చినమీరా ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలి

నాటక రంగ కళాకారులకు ప్రభుత్వాలు సరైన ప్రోత్సాహాన్ని అందించడం లేదు. సినిమాలపై ఆసక్తితో నాటకాలను ప్రస్తుతం పెద్దగా ఆదరించడం లేదు. అయినా మక్కువతో నాటకాలు వేస్తూనే ఉన్నా. కళాకారులను గుర్తించి పింఛన్‌ను అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– చినమీరా, నాటక రంగ కళాకారుడు

గాయపడిన బేల్దారి మేస్త్రి మృతి



అల్లూరు: కూలీ పని కెళ్లి రెండో అంతస్తు నుంచి పడి బేల్దారి మేస్త్రి మృతి చెందిన ఘటన అల్లూరు మండలం గొల్లపాళెంలో చోటుచేసుకుంది. అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి వివరాల మేరకు.. అల్లూరు మండలం గొల్లపాళెంలోని చైల్డ్ ఆశ్రమంలో రెండో అంతస్తు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులకొచ్చిన కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన పాత్ర లక్ష్మయ్య (34) ప్రమాదవశాత్తూ శుక్రవారం పడి తీవ్రంగా గాయపడ్డారు. మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదు



ఉదయగిరి నియోజకవర్గంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నెల్లూరు సిటీ: జిల్లాలో శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలని.. అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌ను స్థానిక పోలీస్ అధికారులు శనివారం నిర్వహించారు. గ్రామాల్లో హింసకు తావులేకుండా ముందు జాగ్రత్తలు చేపడుతున్నామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆరిఫ్ హఫీజ్

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు సిటీ: జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శనివారం ఆయన నిర్వహించారు. అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. పారదర్శకతతో కోరుకున్న చోటుకే ఖాళీల ఆధారంగా స్థానచలనం చేశామని తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని, అనధికారికంగా గైర్హాజరవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కార మార్గాన్ని చూపాలని పరిపాలన విభాగాధికారులను ఆదేశించారు. బదిలీలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, సస్పెన్షన్ నుంచి రిలీవ్, సర్వీస్ సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోన్, అనారోగ్యం కారణంగా బదలాయింపు తదితరాలపై అర్జీలను స్వీకరించారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు.. అపరిష్కృతంగా ఉన్న పనుల తక్షణ పరిష్కారంపై తగు సూచనలు చేశారు. వీటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం రెండో శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కలను చెల్లించుకున్నారు. అభిషేకం, సుప్రభాత, పూలంగిసేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం కల్యాణాన్ని జరిపారు. ఊంజల్‌సేవను రాత్రి నిర్వహించారు.



హాజరైన భక్తులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	164
లేయర్ (లైవ్)	120
బ్రాయిలర్ చికెన్	288
బ్రాయిలర్ స్కిన్‌లెస్	318
లేయర్ చికెన్	204



నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	రూ.77
సన్నవి	రూ.40
పండ్లు	రూ.30



కలిగిరిలో చోరీ

కలిగిరి: కలిగిరిలోని కొండాపురం రోడ్డులో గల మణి ఎలక్ట్రికల్స్‌లో రూ.50 వేల నగదు చోరీకి గురైంది. నిర్వాహకుడు దాసరి సుబ్రహ్మణ్యం వివరాల మేరకు.. దుకాణంలో తన భార్య విజయమ్మను ఉంచి పనిపై మధ్యాహ్నం బయటకెళ్లానని చెప్పారు. ఈ క్రమంలో సామగ్రి కొనుగోలు నిమిత్తం ఓ వ్యక్తి వచ్చారని, చిల్లర తీసుకునే సమయంలో క్యాష్ కౌంటర్‌లో 500 నోట్ల కట్ట రూ.50 వేలు ఉండటాన్ని గమనించారని తెలిపారు. మరోసారి వచ్చి వేరే వస్తువును కొనుగోలు చేయాలని మాట్లాడుతూ, కౌంటర్‌లోని నగదును చోరీ చేశారన్నారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ



మనస్విత

ఆత్మకూరు: నీట్ ఫలితాల్లో ఆత్మకూరుకు చెందిన విద్యార్థి అక్కలరెడ్డి మనస్విత 1689 ర్యాంక్‌ను సాధించింది. అనంతసాగరం మండలం అగ్రహారానికి చెందిన అక్కలరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉషా దంపతుల రెండో కుమార్తె మనస్విత.. శ్రీచైతన్య కళాశాలలో కోచింగ్ తీసుకొని నీట్‌లో 720కి గానూ 700 మార్కులను సాధించింది. ఆమెను శనివారం అభినందించారు. ఎంబీబీఎస్ అనంతరం ఎమ్మెస్ పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాల పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించడమే తన ధ్యేయమని చెప్పారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



స్కానింగ్ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

నెల్లూరు(అర్బన్): లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్యశాఖ డెమో అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని ఇమేజ్ స్కాన్స్ అండ్ డయాగ్నొస్టిక్స్ సెంటర్, నెల్లూరు వాస్క్యులర్ సెంటర్, ఇందిరా స్కానింగ్ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పీసీ, పీఎన్డీటీ యాక్ట్ మేరకు నిబంధనలను పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆయా స్కానింగ్ కేంద్రాలకు ఇచ్చిన లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. స్కానింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఫారం – ఎఫ్ ద్వారా ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూఎస్‌ఓ బోర్డు డైరెక్టర్‌గా బిందు మేనన్



నెల్లూరు(అర్బన్): అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ బిందు మేనన్ వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎస్ఓ) బోర్డు డైరెక్టర్‌గా ఎంపికయ్యారని ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను హరనాథపురంలోని అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో శనివారం ప్రదర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2028 వరకు ఈ పదవిలో ఆమె కొనసాగనున్నారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పది మంది బోర్డు డైరెక్టర్లు ఉండే ఈ పదవిలో బిందు మేనన్‌కు స్థానం దక్కడాన్ని అభినందించారు. ఆమెకు అపోలో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందనలను తెలియజేశారన్నారు. సమావేశంలో ఆస్పత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.